సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పద్మనాభం: పద్మనాభం 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పాండ్రంగి, సామయ్యవలస ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా సంబంధిత ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాండ్రంగి, సామయ్యవలస, మునివానిపేట గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

రామానాయుడు స్టూడియోలో సుమన్ చిత్రం షూటింగ్


షూటింగ్ లోకేషన్‌లో నటుడు సుమన్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలోని డా. రామానాయుడు ఫిల్మ్ స్టూడియోలో సీనియర్ నటుడు సుమన్ గురువారం సందడి చేశారు. ఇక్కడ నూతనంగా నిర్మిస్తున్న ఓ సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. సినిమా టైటిల్, ఇతర పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని చిత్ర యూనిట్ తెలిపింది.

మజ్జి శ్రీనుకు శుభాకాంక్షలు



చిన్న శ్రీనును సత్కరిస్తున్న మారుతీ ప్రసాద్ తదితరులు

మధురవాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను)కు వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం విశాఖ జిల్లా అధ్యక్షుడు వంకాయల మారుతీప్రసాద్, సీనియర్ నాయకుడు జేఎస్ రెడ్డి, పీవీజీ అప్పారావు, పెంద్ర అప్పన్న తదితరులు శుభాకాంక్షలుతెలిపారు. విజయనగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పమాలతో సత్కరించారు.

అధ్యాపకులకు ప్రత్యేక నైపుణ్యాలు అవసరం


కొమ్మాది: డిజిటల్ యుగంలో విద్యార్థులు అదనపు సమాచారం కోసం ఇంటర్నెట్ ద్వారా అనుసంధానం అవుతున్నారని గీతం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు అన్నారు. వారిని తరగతి గదిలో ఏకాగ్రతగా ఉంచాలంటే అధ్యాపకులు ప్రత్యేక నైపుణ్యాలను అలవరుచుకోవాలని సూచించారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న అధ్యాపక శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తరగతి గదిలో విద్యార్థులతో ముఖాముఖి చర్చలు, ఆలోచనలు రేకెత్తించే ప్రశ్నలు, సిలబస్‌లో లేని అదనపు సమాచారాన్ని అందించడం ద్వారా వారికి కోర్సు పట్ల ఆసక్తి పెంచవచ్చన్నారు.

1084 పశువులు, కోళ్లకు పరీక్షలు


ఆనందపురంలో రైతులకు మందులు పంపిణీ చేస్తున్న జేడీ చిన్నయ్య

తగరపువలస: పాడి పరిశ్రమపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చిన్నయ్య అన్నారు. ఆనందపురం మండలం బంటుపల్లి కళ్లాలు, ముచ్చర్లలో గురువారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆయన రైతులతో మాట్లాడారు. ఈ నెల 21న ప్రారంభమైన వైద్య శిబిరాలు 30 వరకు జరుగుతాయన్నారు. నిర్మించిన గోకులం షెడ్లు సందర్శించారు. ఈ సందర్భంగా 1084 పశువులు, కోళ్లకు పరీక్షలు చేశారు. శిబిరంలో ఉప సంచాలకుడు చంద్రశేఖర్, ఏడీ శ్రీనివాస్, డీఎల్‌డీవో ఈవో ప్రసాదరావు పాల్గొన్నారు.

రింక్‌లో దిగితే పతకమే..





చక్రాల బూట్లతో ప్రపంచాన్ని చుట్టేస్తోంది బొల్లా ప్రగడ శ్రీసాహితి. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు స్కేటింగ్ రింక్‌లోకి దిగితే పతకాలు తన వెంట రావల్సిందే. అతి చిన్న వయస్సులో అత్యధిక పతకాలు సాధించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ – 2024లో స్థానం సాధించింది. 13 ఏళ్ల వయసులో 103 పతకాలను సాధించిన ఈ చక్రాల చిరుత విశాఖ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేస్తోంది.

- స్కేటింగ్‌లో రాణిస్తున్న శ్రీ సాహితి
- అంతర్జాతీయ స్థాయిలో సత్తా
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

కొమ్మాది: స్కేటింగ్‌లో రివ్వున దూసుకుపోతోంది ఎండాడకు చెందిన శ్రీసాహితి. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న ఈమె అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ ప్రశంసలందుకుంటోంది.

చిరుప్రాయంలోనే చక్రాల చిరుతలా..

ఈ చక్రాల చిరుత 4వ ఏటనే స్కేటింగ్ రింక్‌లో అడుగుపెట్టింది. కాళ్లకు చక్రాల బూట్లతో తోటి చిన్నారులతో ఉత్సాహంగా రింక్‌లో పరుగులు తీసింది. స్కేటింగ్‌పై సాహితికి ఉన్న అమిత ఆసక్తిని, అంకిత భావాన్ని గమనించిన తల్లిదండ్రులు బొల్లాప్రగడ విశ్వ ప్రభాకర్, మాధురి శైలజ ఎంతో ప్రోత్సహించారు. కోచ్ ఎ. పవన్ కుమార్ వద్ద శిక్షణ ఇప్పించారు. క్రమశిక్షణతో, పట్టుదలతో సాధన చేసి అనతి కాలంలోనే పరిణతి సాధించి పోటీలకు సిద్ధమైంది. ప్రాతినిధ్యం వహించిన తొలి టోర్నమెంట్‌లోనే మూడు పతకాలు సాధించి స్కేటింగ్‌పై తనకు ఉన్న మక్కువను చాటుకుంది. సీనియర్ స్కేటర్స్ సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది.



అమ్మ, నాన్న ప్రోత్సాహం మరువలేను

చిన్నప్పటి నుంచి నాకు స్కేటింగ్‌పై ఉన్న ఇష్టాన్ని అమ్మానాన్న గుర్తించి, ఎంతో ప్రోత్సహించారు. స్కేటింగ్ కోచ్ ఎ.పవన్ కుమార్ శిక్షణలో ఎంతో నేర్చుకున్నా, వారి సహకారంతోనే ఇన్ని పతకాలు సాధించగలిగాను. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో పతకాలు సాధించాలని ఉంది. అందుకే రోజూ పట్టుదలతో శిక్షణ తీసుకుంటున్నాను.

– బొల్లాప్రగడ శ్రీసాహితి, స్కేటింగ్ చాంపియన్

వయసు 13.. పతకాలు 103			
స్వర్ణ పతకాలు	54	అంతర్జాతీయ స్థాయి	5
రజతం	38	జాతీయ స్థాయి	23
కాంస్యం	11	రాష్ట్ర స్థాయి	32
		జిల్లా స్థాయి	43

లయబద్ధంగా సాధన

తన చక్రాల బూట్లతో లయబద్ధంగా వినిపిస్తున్న సంగీతానికి అనుగుణంగా విన్యాసాన్ని ప్రదర్శిస్తూ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో పతకమే ధ్యేయంగా సాధన చేస్తోంది శ్రీసాహితి. నిరంతరం రింక్‌లో నైపుణ్యం పెంచుకుంటోంది.

పతకాల పంట

13 ఏళ్ల ప్రాయంలోనే సాహితి 103 పతకాలు సాధించింది. అందులో 54 బంగారు, 38 వెండి, 11 కాంస్య పతకాలు ఉన్నాయి. 5 అంతర్జాతీయ పతకాలు, 23 జాతీయ, 32 రాష్ట్ర, 43 జిల్లాస్థాయి పతకాలు సాధించి స్కేటింగ్‌లో తనకు తానే సాటి అంటూ నిరూపించుకుంటోంది.

- 2019లో గుర్గావ్‌లో జరిగిన 16వ జాతీయ స్థాయి ఐస్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించింది.
- 2019లో విశాఖలో జరిగిన 57వ జాతీయ స్థాయి రోలర్ చాంపియన్‌షిప్‌లో ఒక స్వర్ణం, 4 కాంస్య పతకాలు సొంతం చేసుకుంది.
- 2021లో చండీగఢ్‌లో జరిగిన 58వ జాతీయ స్థాయి రోలర్ చాంపియన్‌షిప్‌లో 4 బంగారు, రెండు కాంస్య పతకాలు గెలుచుకుంది.
- 2021లో పంజాబ్‌లో జరిగిన 59వ జాతీయ స్థాయి రోలర్ చాంపియన్‌షిప్‌లో 4 బంగారు, మూడు కాంస్య పతకాలు కైవసం చేసుకుంది.
- 2022లో బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి రోలర్ చాంపియన్‌షిప్‌లో రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించింది. ఇలా ఎక్కడకు వెళ్లినా తన వెంట పతకం రావల్సిందే అంటూ నిరూపించింది.



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు

స్కేటింగ్‌లో శ్రీసాహితికి అరుదైన గౌరవం దక్కింది. స్కేటింగ్‌లో అతి చిన్న వయస్సులో అత్యధిక పతకాలు సాధించినందుకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ – 2024లో స్థానం సంపాదించుకుంది.

భారత్ తరఫున ప్రాతినిధ్యానికి సన్నద్ధం

ఈ ఏడాది జూలై నెలలో దక్షిణ కొరియాలో జరగనున్న 20వ ఏషియన్ చాంపియన్‌షిప్, ఆగస్ట్ నెలలో ఆస్ట్రేలియాలో జరగనున్న ప్రపంచ స్కేట్ ఒషియానియాలో పతకాలు సాధించేందుకు, పసిఫిక్ కప్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు సన్నద్ధమవుతోంది.


పతకాలతో శ్రీ సాహితి

5వ వార్డులో జెడ్సీ పర్యటన


ముత్యాలమ్మ కాలనీలో పర్యటిస్తున్న జెడ్సీ ఫణిరాం

మధురవాడ: కుళాయి కనెక్షన్ కోసం ఇంటి పన్ను తప్పనిసరి అని జీవీఎంసీ జోన్–2 జోనల్ కమిషనర్ ఎం.వి.డి.ఫణిరాం అన్నారు. కొండవాలు ప్రాంతాలలో ఐటీ బాండ్ ద్వారా ఇంటి పన్ను వేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ రోడ్డులోని ముత్యాలమ్మ కాలనీ, గాంధీనగర్, శివశక్తినగర్ తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ మొల్లి హేమలతతో కలసి గురువారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాలలో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బొట్టవానిపాలెం శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు పరిశీలించారు. తుప్పలతో నిండి ఉండడం గమనించి, వెంటనే జంగిల్ క్లియరెన్స్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. శ్మశాన వాటికలో పెండింగ్ పనులు, బొట్టవానిపాలెం చెరువుకు ఫెన్సింగ్ ఏర్పాటు, వార్డు కాల్వల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పర్యటనలో ఏఎంహెచ్‌వో కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీను, టీడీపీ నాయకుడు మొల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు మాస్టారి సేవలు ప్రశంసనీయం


వెంకటేశ్వర్లు దంపతులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు

మధురవాడ: తరగతి గదిలో విద్యార్థులను తీర్చిదిద్దడంలో గంప వెంకటేశ్వర్లు మాస్టారు విశేషమైన సేవలు అందించారని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. రవి అన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పొందుతున్న సోషల్ ఉపాధ్యాయుడు గంప వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక, సన్మాన పత్రాలు అందజేశారు. సీనియర్ ఉపాధ్యాయుడు సోమయాజులు, బీటీఏ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌బాబు, యూటీఎఫ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, టీఎన్‌యూ అధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత నేతాజీ


వాంబే కాలనీ హైస్కూల్లో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో నేతాజీకి నివాళులు


ఆదర్శహిందీ ప్రేమీ మండలి విద్యార్థుల నివాళులు


మండల పరిషత్ కార్యాలయంలో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈవోఆర్డీ మీనా కుమారి

మధురవాడ: స్వాతంత్య్ర సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. భరత మాత సేవలో ఆయన తరించిన తీరును వక్తలు కొనియాడారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు.

- వాంబేకాలనీ సునీల్‌శర్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని గీతాదేవి ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ శంకర్, వైస్ చైర్మన్ లావణ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్ కోసం గణిత ఉపాధ్యాయులు జి. శాండిల్య రూ.5వేలు అందజేశారు. బాదిరెడ్డి రవిశంకర్, అయ్యగారి కామేష్, వై. అప్పారావు, బి. నాగరాజు తదితరులు 40మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేశారు.
- బీజేపీ మండల అధ్యక్షుడు యండ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు నివాళులు అర్పించారు.
- చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జి.రవి తదితరులు నేతాజీకి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి

పద్మనాభం: యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని ఈవోఆర్డీ మీనాకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన నేతాజీ జయంతి వేడుకల్లో బోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రూపాకుల రవికుమార్, తమటపు నాగమణి పాల్గొన్నారు.

- కృష్ణాపురంలో నేతాజీ చిత్రపటానికి బీజేపీ మండల యువమోర్చా అధ్యక్షుడు హంస మహేష్ నివాళులు అర్పించారు.

తగరపువలస: బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, విద్యార్థులు నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, ఈగల సంజీవి పాల్గొన్నారు.

- భీమిలి మండలం తాటితూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కరుభక్త సన్యాసినాయుడు, ఉపాధ్యాయుడు పోతురాజు, అంగన్‌వాడీ సిబ్బంది అంజలి ఘటించారు.
- భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో భీమిలిలో నేతాజీ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు
- ముఖ్య నాయకులతో సమావేశం


చిన్న శ్రీనుకు సింహాద్రి అప్పన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న నియోజకవర్గ నాయకులు


నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త చిన్న శ్రీను

తగరపువలస: కార్యకర్తలు బలంగా ఉంటేనే నాయకుడు, తద్వారా పార్టీ బలంగా ఉంటుందని నమ్మేవారిలో తాను మొదటి వ్యక్తినని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం మజ్జివలసలో పార్టీ సీనియర్ నాయకుడు దాట్ల పెదబాబు ఇంట్లో గురువారం జరిగిన నియోజకవర్గ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన భీమిలి ప్రజల, కార్యకర్తల, నాయకుల సహకారంతో వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో కార్యకర్తలు, నాయకులకు నూరుశాతం న్యాయం జరిగేలా పని చేస్తానన్నారు. తాను జెడ్పీ చైర్మన్ అయినా కార్యకర్తవలె సమష్టిగా అందరికీ సేవలు అందిస్తానన్నారు. నాయకత్వ మార్పులు చేసేవారికి ప్రజలు గుణపాఠం చెపుతారన్నారు. పార్టీ పిలుపు మేరకు ఫిబ్రవరి 5న జరిగే ఫీజు పోరుపై నియోజకవర్గం నుంచి మొదటిగా ప్రజలకు అండగా ఉందామన్నారు.

ఆసక్తికరంగా సమావేశం

ఈ సందర్భంగా నియోజకవర్గ వార్డు, మండల అధ్యక్షులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చిన్న శ్రీను రాకతో తమకు వెయ్యి ఏనుగుల బలం వచ్చిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న తాము అధికార పక్షంగా ఫీలవుతుండగా, అధికార పక్షం వాళ్లు ప్రతిపక్షంగా ఫీలవుతున్నారన్నారు. గతంలో జగన్ మంత్రి పదవి ఇస్తే దానిని స్వపక్షీయులకు కాకుండా విపక్ష టీడీపీ నాయకుల సేవలకు ఉపయోగించి, వారి చేతే అవమానాలు పడ్డారని గుర్తు చేశారు. తమకు అరగుండులు గీసి వదిలేసిన ఆయన ఇప్పుడు మరో పార్టీ మారుతానంటూ అందరూ తనవెంట రావాలని రాయబారాలు పంపుతున్నారన్నారు. పార్టీకి రాజీనామా చేసినప్పుడు ఎందుకు తమ అభిప్రాయాలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అధికారులు, పోలీసులు వైఎస్సార్‌సీపీ వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని, అయినా ఎవరికీ బెదరబోమని అన్నారు. ఈ సందర్భంగా చిన్న శ్రీనును సింహాద్రి అప్పన్న స్వామి చిత్రపటంతో సత్కరించారు.

సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.ఎస్.ఎన్.రాజు(పులిరాజు), జెడ్పీ చైర్మన్ సుంకర గిరిబాబు, జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, బోని బంగారునాయుడు, మజ్జి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షులు, ఇన్‌చార్జిలు దొడ్డి కిరణ్, జగుపల్లి ప్రసాద్, శిల్లా కరుణాకరరెడ్డి, అల్లిపల్లి నరసింగరావు, మైలపల్లి షణ్ముఖరావు, పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, సరగడ రఘునాథరెడ్డి, డాక్టర్ గాదె రోశిరెడ్డి, గుడ్ల పోలిరెడ్డి, జీరు వెంకటరెడ్డి, కొలుసు ఈశ్వరరావు, కర్రి స్వామి, తుపాకుల అప్పలరాజు, అప్పలస్వామి, మండల పార్టీ అధ్యక్షులు గాడు శ్రీను, బంక సత్యం, కోరాడ లక్ష్మణ, గంట్రెడ్డి శ్రీను, బోని అప్పలనాయుడు, సుంకర బంగారప్పడు, శిరుగుడి ఆదిబాబు, ఈర్ల ఈశ్వరరావు, కుడితి రామారావు, చందక సూరిబాబు, లెంక రాంబాబు, పాండ్రంగి శ్రీను, చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, బొడ్డు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

'లోకేష్ ప్రధాని కావాలి'


మాట్లాడుతున్న గంటా రవితేజ

తగరపువలస: అందరూ లోకేషను ఉప ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటే తాను మాత్రం ప్రధానిగా చూడాలనుకుంటున్నానని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ ఆకాంక్షించారు. భీమిలి పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన లోకేష్ పుట్టినరోజు వేడుకలలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలుగు వారిలో పీవీ నరసింహారావు తరువాత నారా లోకేష్ ప్రధాని పదవి చేపట్టాలని తాను కోరుకుంటున్నట్టు తెలిపారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ఫ్లాష్‌మాబ్



ఫ్లాష్‌మాబ్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్)–2025 ఈ నెల 29 నుండి 31 వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీ ఆవరణలో విద్యార్థులు గురువారం నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ అందరినీ ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ విద్యార్థులు ఈ ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు.